

# అమెరి'కా'లేజ్

## - లిపి మల్లాది



*అమెరికాలో కాలేజీ చదువంటే ఒకప్పుడు గగనకుసుమం, అదో ఇంద్రజాలం. గత రెండు, మూడు దశాబ్దాల్లో అమెరికాలో చదువుకోసం వస్తున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడమే కాక, ఇండియాలో కూడా ఒక మాదిరిగా చదువుకున్న కుటుంబాల్లో దాదాపు ప్రతి ఇంటికీ కనీసం ఒకరైనా అమెరికాలో చదువుకుంటున్న పిల్లలుంటున్నారు. ఇంటర్నెట్ అరచేతిలోకొచ్చేసిన ఈ రోజుల్లో అమెరికాలో కాలేజీలు ఎలా ఉంటాయీ, అక్కడ డార్మ్స్ ఎలా ఉంటాయి, స్టూడెంట్స్ జీవితాలు ఎలా ఉంటాయీ... అనే విశేషాలు అతి సులువుగా తెలిసిపోతున్నట్లనిపిస్తున్నాయి. ఐనా మొదటిసారి చదువుకోసం అమెరికా వచ్చే ప్రతి విద్యార్థికీ ఎవరి అనుభవం వారిదే, ఎవరి ఇబ్బందులు వారివే, ఎవరి స్నేహాలు వారివే. ఈ నేపథ్యంలో అమెరికాలో చదువుకోసం వచ్చిన ఓ సాధారణ మధ్యతరగతి అమ్మాయికి ఎదురైన సంఘటనలు, సన్నివేశాలు.. స్నేహాలు, సంతోషాలు.. సరదాలు.. వెరసి ఇవన్నీ అమెరికాలేజీ కథలు. స్వానుభవాలనూ, విన్న అనుభవాలనూ, చూసిన అనుభవాలనూ - ఆసక్తికరమైన ధారావాహికగా కౌముది పాఠకులకు అందిస్తున్నది లిపి మల్లాది. 'నా కళ్ళతో నాన్న' ధారావాహికతో కౌముది పాఠకుల అభిమానాన్ని సొంతం చేసుకున్న లిపి మల్లాది ఈ ధారావాహికతో మీకు మరింత చేరువౌతుందని ఆశిస్తూ..*

*- సంపాదకుడు*

*(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)*

**హనీష, వెన్నెలతోపాటు** షాపింగ్‌కి వెళ్ళాను. ప్రెషర్స్ పార్టీకోసం హనీష ఒక డ్రెస్ కొనుక్కుంది. నన్నుకూడా ఒకటి కొనుక్కోమని బలవంతం చేసింది. మాల్‌లో చాలా షాప్స్ తిరిగాక నా బడ్జెట్‌లో సరిపోయి మోకాలి కింద వరకు వచ్చే డ్రెస్ ఒకటి దొరికింది. హనీష అది చర్చ్‌లో నన్‌లు వేసుకునే డ్రెస్‌లా ఉందని, మరో ఇంకా పొట్టి డ్రెస్ తీసుకోమని పంతం పట్టింది. నా ఇబ్బంది గ్రహించి వెన్నెల స్టాకింగ్స్ వేసుకుంటే కాళ్ళు కనపడవని, పొట్టిది వేసుకున్నా చుడీదార్ పేంట్‌లాగా స్టాకింగ్స్ వేసుకోవచ్చని సలహా ఇవ్వడంతో ఆ పని చేసాను.

ఫ్రెషర్స్ పార్టీరోజు మొదట్లో ఇబ్బంది పడ్డాను కానీ నేహ ఇచ్చిన ప్రోత్సాహానికి ధైర్యం కలిగింది. తను నాకు మేకప్ వేస్తానని అనడంతో నేను కూడా కాస్త కుతూహలంగా ఒప్పుకున్నాను. తను ఐ లైనర్ వెయ్యడానికి బాగా ఇబ్బంది పడింది.

నా కనురెప్పలు కొట్టుకోవడంతో కేవలం ఐ లైనర్‌కే పావుగంట పట్టింది. తనుకూడా నాతో వస్తాననటంతో ఇద్దరం కలిసి వెళ్ళాము.

ఆ పార్టీలో ఉన్న వాళ్ళలో సగం మంది మాత్రమే నాకు తెలుసు. ఆ సగంలో సగం మంది నన్ను గుర్తుపట్టలేదు. నేను వెళ్ళి పలకరించేలోపు నేహ తన ఫ్రెండ్స్‌కి పరిచయం  చేసింది. వాళ్ళందరూ నార్త్ ఇండియన్స్. ఇక్కడ కొద్దిసేపు ఉన్నాక అందరూ కలసి బయటకి వెళ్దాం అనుకున్నారట. నేను హైదరాబాద్ నుండి వచ్చానని చెప్పాక ఆ నార్త్ ఇండియన్స్‌లో కొంతమంది మాట్లాడ్డం తగ్గించారు. అన్నయ్య అమెరికాకి వచ్చినప్పుడు ఇలాంటి వాళ్ళ ఇంట్లోనే ఉండి ఉంటాడు.

వీళ్ళ మీద చిరాకు, కోపం వెంటనే కలిగి నా ఫ్రెండ్స్ దగ్గరికి వెళ్ళాలని వెనక్కి తిరిగాను. నేహకి, మరో అబ్బాయి పీయూష్‌కి అర్థమైందనుకుంటాను. వాళ్ళు నాకు సారీ చెప్పారు. అలాంటి వాళ్ళతో వీళ్ళు ఎందుకు ఫ్రెండ్స్‌గా ఉన్నారు అన్న విషయం నాకు అర్థంకాలేదు.

నా ఫ్రెండ్స్ దగ్గరికి వెళితే వాళ్ళు ఆశ్చర్యపోయారు.

"నువ్వేనా? నేనింకా ఎవరో అనుకున్నాను" అని కొందరు.

"నువ్వే అనుకున్నా కానీ కాదేమో అనిపించింది" అని కొందరు అన్నారు.

"రోజూ ఇలానే తయారవ్వచ్చుగా" అని అన్నారు.

కొద్దిసేపటికి హనీష వచ్చింది. తనుకూడా నన్ను చూసి ఆశ్చర్యపోయింది.

"నువు మేకప్ వేసుకుంటావా?" అడిగింది.

"లేదు, నేహ వేసింది" బదులిచ్చాను.

"బావుంది. నీకు బాగా సెట్ అయ్యింది."

"థాంక్స్. వెన్నెల రాలేదా?"

"వచ్చింది.. కార్ పార్క్ చేస్తోంది."

"ఓ.ఓకే"

"మీ డార్మ్స్ లో ఒక కేరళా అమ్మాయి ఉంటుంది. పరిచయం చెయ్యనా?"

"యా చెయ్యి"

"తనకి మెసేజ్ చేసి చూస్తా వస్తుందేమో"

"ఓకే"

ఇంతలో వెన్నెల వచ్చింది.

"అదేంట్రోయ్. అసలు నీలానే లేవు. డ్రెస్ చూసి గుర్తుపట్టాను" వెన్నెల అంది.

చిన్నగా నవ్వి "నేహ మేకప్ వేసింది" అన్నాను.

"నువ్వే వేసుకున్నావనుకున్నాను" అంది.

"నాకు అంత సీన్ లేదు" అన్నాను.

ఇద్దరం నవ్వాము.

"సునీత హాఫ్ ఎన్ అవర్‌లో వస్తుందట" హనీష ఫోన్ పెట్టి చెప్పింది.

ఇంతలో మైక్‌లో ఎవరో మాట్టాడ్డం మొదలు పెట్టారు. కొత్త స్టూడెంట్స్‌కి వెల్కం చెప్తూ ఒక పదినిమిషాలు అవసరంలేని స్పీచ్ ఇచ్చారు. తరవాత ఇండియన్ స్టూడెంట్ అసోసియేషన్‌లో వాళ్ళని పరిచయం చేసారు. చాలామంది చుడీదార్, సల్వార్ కమీజ్ వేసుకుని వచ్చారు .నాక్లాస్ మేట్స్ కొంత మంది జీన్స్, టీ షర్ట్ వేసుకుని వచ్చారు .దాంతో నేను కాస్త చిన్నబోయాను. హనీష వాళ్ళలాగా డ్రెస్ కాకుండా మామూలుగా రెడీ అవ్వాల్సింది. కొద్దిసేపటికి అందరూ డాన్స్ మొదలు పెట్టారు. నేను, మరో అమ్మాయి మాత్రం కూర్చుండిపోయాము. చాలామంది బలవంతం చేసారు కానీ మేము కదలలేదు. కాసేపటికి నేహ బలవంతంగా లాక్కెళ్ళింది. కొద్దిసేపు అక్కడ నుంచుని మళ్ళీ వెళ్ళి కూర్చున్నాను.

కాసేపటికి డాన్స్‌లు ఆపి, కొంతమంది పాటలు పాడారు .నేహ స్నేహితులు కొంతమంది వెళ్ళిపోయారు. కొంతమంది బానే పాడారు. కానీ కొంతమంది వల్ల నవ్వు ఆపుకోలేకపోయాను. వాళ్ళ పాటలు ఆగాక మరో స్పీచ్ ఇచ్చి మిస్ ఫ్రెషర్, మిస్టర్ ఫ్రెషర్‌లాంటివి ఇచ్చారు. క్వీన్ ఆఫ్ రోసెస్ నాకు ఇచ్చారు, ఎందుకో తెలిదు. తరవాత హనీషని అడిగాను.

"నాకెందుకు ఇచ్చారు?"

"జూనియర్స్ అందరిలో నువ్వే స్టైలిష్ ఉన్నావు కాబట్టి" అలా కూడా ఉంటారా అనుకున్నాను.

"సునీత, షీ ఈజ్ అవని. షీ లివ్స్ ఇన్ యువర్ డార్మ్స్ ' హనీష పరిచయం చేసింది.

సునీత గలగలా మాట్లాడింది. తనే ప్రశ్న అడుగుతుంది. తనే సమాధానం చెప్తుందికానీ స్నేహంగా అనిపించింది. ఈలోగా నేహ వచ్చి వాళ్ళతో బయటికి వస్తానా అని అడిగింది.

ఇబ్బందిగా లేదని చెప్పాను. ఈలోగా నేహ, సునీత మాట్లాడుకున్నారు .సునీత వాళ్ళతో కలిసి బయటకి వెళ్ళడానికి ఒప్పుకుంది. ఇద్దరూ నన్ను కాస్త బలవంతం చేసారు. దాంతో సరే అన్నాను. నేహ ఫ్రెండ్స్ కార్‌లో బయటకి వెళ్ళాము. కారులో అందరూ ఆ పాడిన వాళ్ళ గురించి జోకులు వేసుకున్నారు. నాకు అంత బాగా అనిపించలేదు. కారు పార్క్ చేసాక నాకు తెలిసింది. వీళ్ళు పబ్‌కి వచ్చారని ముందే తెలిసుంటే నోరు మూసుకుని ఇంటికి వెళ్ళిపోయేదాన్ని. 'డూ యూ వాంట్ టు గో అవుట్" అంటే 'వేర్' అని అడగనందుకు నాపైన నాకు చాలా కోపం వచ్చింది .ఏం చెయ్యాలో తోచక హనీషకి

మెసేజ్ చేసాను. 'ఏం కాదు, యూవిల్ హేవ్ ఫన్' అని బదులిచ్చింది. నేను మళ్ళీ మెసేజ్ చేసాక ఎక్కడున్నానో చెపితే తను, వెన్నెల వచ్చి పిక్ చేసుకుంటామని చెప్పింది. ఊపిరి పీల్చుకుని "వేర్ ఆర్ వీ?" అడిగాను.

"డౌన్ టౌన్" అన్నారు కానీ మరేమీ చెప్పలేదు. వాళ్ళతో కలసి పబ్‌లోకి వెళ్ళేముందు పేరుని హనీషకి పంపాను. నేను లోపలకి వెళ్ళేసరికి ఆ న్ ద వే ' అంది. లోపల అంతా బాగానే అనిపించింది. సినిమాలో చూపించినట్టు చీకటిగా, గందరగోళంగా లేదు. నా వయసు వారే ఉన్నారు. కొన్ని టేబుల్స్ దగ్గర ఐదు, ఆరుమంది కబుర్లు చెప్పుకుంటున్నారు. బార్ దగ్గర కొంతమంది కూర్చున్నారు. మరికొంతమంది డాన్స్ చేస్తున్నారు .అసభ్యంగా ఏమీ లేదు. కాస్త కుదుటపడ్డాను. వాట్ డూ యూ వాంట్ టూ డ్రింక్?" నేహ ఫ్రెండ్ అడిగాడు.

"కోకా కోలా" అన్నాను.

"నో ఆల్కా హాల్?" అడిగాడు.

"నో" అన్నాను.

"ఆర్ యూ షూర్?" అడిగాడు.

"యస్"

"డూ యూ వాంట్ టూ ట్రై?"

"నో థాంక్స్" కోపంగా అన్నాను.

ఇంతలో ఎవరో వచ్చి నాతో మాట్లాడారు. ఏమన్నారో నాకు అర్ధంకాలేదు. అతను రెండుసార్లు చెప్పినా నాకు అర్ధంకాకపోవడంతో తలూపాను. అతను ఇంకేదో అన్నాడు. మళ్ళీ అర్ధంకాలేదు. ఈలోగా పీయూష్ వచ్చి

"డూ యు నో హిం?" అడిగాడు.

"నో" అన్నాను.

"లెట్స్‌గో అండ్ సిట్" అన్నాడు.

అందరం కలిసి రెండు టేబుల్స్ జోడించి కూర్చున్నారు. అక్కడ డాన్స్ చేస్తున్న వాళ్ళని చూసి నవ్వుకున్నాము. కాలేజీలో వాళ్ళ గురించి గాసిప్స్ చెప్పుకున్నారు. నేను కూడా వాళ్ళతో కలిసి జోకులు వేయడం మొదలు పెట్టాను. అదే సమయానికి

"కమ్ అవుట్" అని హనీష మెసేజ్ పంపింది.

అప్పుడే వచ్చేసారా అనిపించింది. వీళ్ళందరికి బై చెప్పి వెళ్ళిపోయాను. కొంతమంది ఇంకాసేపు ఉండచ్చుగా అన్నారు. నెక్స్ట్ టైం ఉంటానని మాటిచ్చాను.

కారెక్కగానే హనీష "రాత్రి పదింటికి లెట్స్ గో అవుట్ అంటే ఎక్కడికనుక్కున్నావు?" అడిగింది.

"ఏమో పబ్ అని అనుకోలేదు"

ముగ్గురు నవ్వాము. నా తెలివి తక్కువ తనం అర్థమై చిన్నబోయాను.

యధావిధిగా హనీష ఎవరెవరు వచ్చారు, ఏమేమి మాట్లాడుకున్నామని అకాయ్ పొకాయ్ కబుర్లన్నీ అడిగి తెలుసుకుంది. నన్ను ఇంటికి తెచ్చినందుకు వెన్నెలకి పదే పదే థాంక్స్ చెప్పాను. థాంక్స్ అక్కర్లేదని. ఎప్పుడే సహాయం కావాలన్న వెనకాడక ఫోన్ చెయ్యమని చెప్పి వెళ్ళిపోయింది. నేను బట్టలు మార్చుకుని మొహం కడుక్కుని, అద్దంలో చూసి బిత్తరిపోయాను. నీళ్ళు తగిలి ఐ లైనర్ మొహమంతా పాకింది కానీ పూర్తిగా పోలేదు. మరోసారి మొహాన్ని కడిగి నవ్వుకున్నాను.

నిద్రపట్టకపోవడంతో ఓ పుస్తకం తెరిచి చదవసాగాను. ఇంతలో బయట మాటలు, నవ్వులు వినబడ్డాయి. వెంటనే లైట్ ఆఫ్ చేసి పడుకున్నట్టు నటించాను. నేహ తన స్నేహితులతో వచ్చింది. నేను నిద్రపోతున్నానని, మరొకరి గదికి వెళదామని చెప్పడం విని ఆనందించాను. అంతా వెళ్ళిపోయారనే నమ్మకం కలిగాక పుస్తకం చదువుదామనుకున్నాను కానీ ఈలోగా నిద్రలోకి జారుకున్నాను.

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments on this story